క్లుప్తంగా

వర్షంతో చల్లబడిన వాతావరణం



ఏలేశ్వరంలో కురుస్తున్న వర్షం

ఏలేశ్వరం: మండలవ్యాప్తంగా ఆదివారం భారీ వర్షం కురిసింది. తెలవారుజామున ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. సుమారు 3 గంటల పాటు భారీ వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. కొద్ది రోజులుగా మండిపోతున్న ఎండలకు అల్లాడిన ప్రజలు వర్షం పడడంతో ఉపశమనం పొందారు. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం పడటంతో రైతులు ఖరీఫ్ సాగు పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ వర్షం ఉద్యాన, ఖరీఫ్ పంటలకు మేలు చేస్తుందని అధికారులు తెలిపారు.

గోకవరంలో భారీ వర్షం

గోకవరం: మెట్ట ప్రాంతమైన గోకవరం మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం పూర్తిగా స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం 9 గంటల వరకూ వర్షం కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. దీంతో ప్రజలు వేసవితాపం నుంచి ఉపశమనం పొందారు. వర్షం పడటంతో రైతుల్లో ఆనందం నెలకొంది.

భగవద్గీత ప్రతుల పంపిణీ



భగవద్గీతపై ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరులో త్రైత సిద్ధాంత ప్రబోధనా సమితి రాజమహేంద్రవరం హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత గ్రంథాలను (భగవద్గీత ప్రతులను) పంపిణీ చేశారు. జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా భగవద్గీత ప్రతులను పంపిణీ చేసినట్టు కమిటీ ఉపాధ్యక్షుడు శాంతరాజు తెలిపారు. కమిటీ సభ్యులు సత్యవతి, వ్యాస్, జలంధర్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



కత్తిపూడిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేసి క్లోరినేషన్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన పాలన



ఎమ్మెల్యే యనమల దివ్య, శాసనమండలి ప్రతిపక్షనేత రామకృష్ణుడులను సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు

తుని: సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని ఎమ్మెల్యే యనమల దివ్యా అన్నారు. స్థానిక రాజాగ్రౌండ్స్‌లో ఆదివారం సాయంత్రం విజయోత్సవ సభ నిర్వహించారు. తొలుత సాయి వేదిక నుంచి గొల్లప్పారావు సెంటర్, బాలాజీ కాంప్లెక్స్ మీదుగా రాజా గ్రౌండ్స్ వరకూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గొల్లప్పారావు సెంటర్లో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యనమల దివ్య మాట్లాడుతూ తనకు విజయాన్ని కట్టబెట్టిన తుని నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అండగా నిలిచిన ప్రజలకు మంచి పాలన అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్యను స్థానిక టీడీపీ నేతలు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్లు కుశమంచి శోభారాణి, ఇనుగంటి సత్యనారాయణ, టీడీపీ నాయకులు సుర్ల లోవరాజు, యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్, జనసేన నాయకులు బోడిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రోయిన్లకు తూట్లు.. రైతులకు పాట్లు

- ఇసుక అక్రమ తవ్వకాలతో శిథిలమైన వైనం
- ఏటా రైతులకు తప్పని సాగునీటి ఇబ్బందులు
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు



తాండవ నదిపై శిథిలావస్థలో ఉన్న కామినీడువారి గ్రోయిన్

కోటనందూరు: పాలకుల నిర్లక్ష్య వైఖరి, అధికారుల ఉదాశీనత వెరసి తాండవ ఆయకట్టు రైతుల పాలిట శాపంగా మారింది. మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు అందించేందుకు ఆంగ్లేయుల కాలంలో తాండవ నదిపై గ్రోయిన్లు నిర్మించారు. కాల క్రమంలో రెండు దశాబ్దాల క్రితం నాటికే ఈ గ్రోయిన్లు శిథిలావస్థకు చేరాయి. అప్పటినుంచి వీటి అభివృద్ధికి ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయడం, సక్రమంగా వినియోగించకపోవడంతో ప్రభుత్వ నిధులు నీటిలో కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. ఫలితంగా బ్రిటిష్‌కాలంలో నిర్మించిన గ్రోయిన్లకు కళతప్పింది. ఈ దుస్థితికి ప్రధాన కారణం తాండవ నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు. అధికారుల కళ్లముందే ఇసుక మాఫియా రెచ్చిపోతున్నా .. ఆవైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. మండల ప్రజలు రెండు దశాబ్దాలుగా నెత్తినోరు కొట్టుకున్నా ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో అధికారులు ఇసుక అక్రమాలను అడ్డుకోలేకపోతున్నారు. దీంతో గ్రోయిన్ల కింద ఉన్న వేల ఎకరాల పంట పొలాలు బీడు వారుతున్నాయి. ఇప్పటికైనా గ్రోయిన్ల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

30 వేల ఎకరాల ఆయకట్టు

తాండవ జలాశయం పరిధిలో తుని నియోజకవర్గంలో 30 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో 18 వేల ఎకరాల ఆయకట్టుకు తాండవ జలాశయం నుంచి కోటనందూరు, భీమవరపుకోట, ఇండుగపల్లి మేజర్ కాలువల ద్వారా సాగునీరు అందిస్తున్నారు. మిగిలిన 12 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు ఆరు దశాబ్దాల క్రితం తాండవ నదిపై అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలో నిమ్మకట్టుతో పాటు మండలంలోని అల్లిపూడి, కొట్టాం, కోటనందూరు, కామినీడు, దిగువాయి గ్రోయిన్లు నిర్మించారు. రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ గ్రోయిన్ల పరిసర ప్రాంతాల్లో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరుగుతుండడంతో గోయిన్లు శిథిలమయ్యాయి. గత 20 ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతూ వస్తోంది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా రైతులు సాగునీటికోసం అష్టకష్టాలు పడక తప్పడం లేదు. నదిలో నీటిని గ్రోయిన్ల ద్వారా పొలాలకు మళ్లించకపోతే పంటలు ఎండిపోతాయి.

అధికార పార్టీ నేతలే కాంట్రాక్టర్లు

గత చరిత్రను గమనిస్తే శిథిలమైపోతున్న గ్రోయిన్లను నిర్మించేందుకు అధికార పార్టీ నేతలే కాంట్రాక్టర్లుగా వ్యవహరించారు. కంటి తుడుపు చర్యగా నాసిరకం మెటీరియల్‌తో లోపభూయిష్టంగా చేసిన పనులు ఏడాది లోపే ఏటిలో కొట్టుకుపోయేవి. మళ్లీ ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులు గోల చేయడం, అధికారులు ప్రణాళికలు తయారు చేయడం, ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పరిపాటిగా మారింది. ఇలా ఏటా గ్రోయిన్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.కోట్ల నిధులు మంజూరు చేయడం, సాగునీటి కోసం రైతులు ఇబ్బంది పడడం రివాజుగా మారింది. ఇప్పటికీ ఏటా ఖరీఫ్‌కు ముందు అన్నదాతలు గ్రోయిన్ల వద్ద ఇసుక బస్తాలు వేసుకొని సాగునీటిని మళ్లించుకునే దయనీయ పరిస్థితులు కొనసాగుతున్నాయి.

> **గ్రోయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి**
>
> 
>
> తాండవ నదిలో అడ్డగోలుగా జరుపుతున్న ఇసుక తవ్వకాలతో కోట్ల రూపాయలతో నిర్మించిన గ్రోయిన్లు శిథిలమయ్యాయి. గ్రోయిన్లు సక్రమంగా లేక ఏటా సాగునీటి కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరిపంట నీరందక ఎండిపోయే పరిస్థితులు ఏటా ఎదురవుతున్నాయి. పట్టించుకోవాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారు. గ్రోయిన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.
>
> రామసూరి సత్యనారాయణ, రైతు, బొద్దవరం

ప్రమాదకరంగా రహదారులు



తాళ్లూరు జంక్షన్-వి.కొత్తూరు కొత్త కాలనీల మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు



చేపూరు-మర్లపాడు మధ్య గోతులతో ప్రమాదకరంగా మారిన లోవ రోడ్డు

- ప్రయాణికులకు ఇక్కట్లు
- మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానికి వెళ్లే రహదారి వర్షాలకు ఛిద్రమైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో పలు జిల్లాల నుంచి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు ప్రత్యేక వాహనాల్లో లోవ దేవస్థానికి వస్తుంటారు. వందల కిలో మీటర్లు సౌకర్యవంతంగా ప్రయాణించినప్పటికీ 16వ నంబరు జాతీయ రహదారి దాటిన తర్వాత నాలుగైదు కిలో మీటర్ల మేర రహదారి పూర్తిగా ఛిద్రమై గోతులు ఏర్పడడంతో వాహనాలు అవస్థలు పడుతున్నారు.

పలు జిల్లాల నుంచి భక్తులు

అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాలకు చెందిన భక్తులు జాతీయ రహదారి మీదగా తుని మండలం జగన్నాథగిరి చేరుకుని అక్కడ నుంచి లోవ రోడ్డులో ప్రయాణించాల్సి ఉంది. ఈ మార్గంలో తాళ్లూరు జంక్షన్, వి.కొత్తూరు కొత్తకాలనీ, లోవకొత్తూరు చెరువు గట్టుపై రోడ్లు భవనాలశాఖకు చెందిన రహదారిలో గుంతలు ఏర్పడ్డాయి. చినుకుపడితే చాలు ఆ గుంతల్లో వర్షపునీరు చేరి ప్రమాదకరంగా మారుతున్నాయి. అలాగే కాకినాడ, తూర్పు గోదావరి, అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి తదితర జిల్లాలకు చెందిన భక్తులు అన్నవరం, తుని మండలం చేపూరు వద్దకు హైవే మీదగా చేరుకుని రాజుపేట, మర్లపాడు గ్రామాలను దాటుకుని లోవకు చేరుకుంటారు. ఈ రహదారి చేపూరు, మర్లపాడు, రాజుపేట, కొత్త వెలంపేట, తదితర ప్రాంతాల్లో వర్షానికి ధ్వంసమైంది. దీంతో ఈ మార్గంలో వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నరు.

ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలి



రామయ్యపాలెంలో తాగునీటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, అధికారులు



అన్నవరంలో పబ్లిక్ కుళాయి ద్వారా వచ్చే నీటిని పరీక్షిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గండేపల్లి: గ్రామాల్లో ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలని ఎంపీడీఓ ఎస్ హనుమంతరావు, ఈఓపీఆర్డీ వీఎస్ఎన్ మూర్తి సూచించారు. మండలంలోని రామయ్యపాలెంలో ఆదివారం వారు పర్యటించి తాగునీటిలో క్లోరిన్ శాతాన్ని పరిశీలించారు. తాగునీటిని పరీక్షించగా క్లోరిన్‌శాతం 0.2–0.3 మధ్య ఉన్నట్టు గుర్తించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ టి.రాంప్రసాద్, ఏఎస్ఎం పి.సుబ్బలక్ష్మి, ఆశా సీహెచ్ దేవి పాల్గొన్నారు.

తాగునీటికి పరీక్షలు

అన్నవరం: గ్రామాల్లో డయేరియా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా అన్నవరంలో ఆదివారం వాటర్ ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్ వంటి చర్యలు చేపట్టినట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాగునీటి పరీక్షలు నిర్వహించి నివేదికలు కలెక్టర్ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో శంఖవరం ఎండీఓ ఎం.విజయ్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ శుభశ్రీ, భవాని, ఎంఎల్‌హెచ్‌పీ మాధురి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం కూల్చివేత హేయమైన చర్య

మాజీ మంత్రి తోట నరసింహం



మాజీ మంత్రి తోట నరసింహం

కిర్లంపూడి: కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష్య సాధింపులో భాగంగా తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని కూల్చివేయడం హేయమైన చర్య అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట నరసింహం అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 రోజుల్లోనే విధ్వంసాలు సృష్టిస్తూ అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతోందన్నారు. అప్పట్లో ఎటువంటి అనుమతులు లేకుండా అనాధికారికంగా నిర్మించిన ప్రజావేదికను కూలగొడితే టీడీపీ నేతలు గగ్గోలు పెట్టారని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం నుంచి పూర్తి అనుమతులు తీసుకుని నిర్మిస్తున్న పార్టీ కార్యాలయం కూల్చివేతను ఏమంటారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రస్తుతం ఉంటున్న ఇల్లు కూడా అనాధికారిక స్థలంలోనే ఉందని గుర్తు చేశారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



సిరిపురంలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు



ధర్మవరంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ శ్రేణులు

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో ఆదివారం శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ విభజన అనంతరం తూర్పుబెంగాల్, కశ్మీర్‌లో మైనార్టీలైన హిందువులపై దాడులకు నిరసనగా శ్యాంప్రసాద్ ముఖర్జీ కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేశారన్నారు. భారతీయ జనసంఘ్‌ను స్థాపించి కశ్మీర్ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం చేశారన్నారు. ఆయన సేవలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెలుగూరి హరేరామ్, సాగి బంగార్రాజు, స్మాలన్‌రాజు, వీరమణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో...

పట్టణంలో బీజేపీ నేత పైల సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు శిడగం కన్నారావు, పైల అయ్యప్ప, చింతల అబ్బులు, ముచ్చు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు శింగిలిదేవి సత్తిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే దేశం, ఒకే రాజ్యాంగం ఉండాలని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ భారతీయ జనసంఘ్‌ను స్థాపించారన్నారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మదినే బాబ్జి, గొల్ల కుమారి, కొండి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బీజేపీ నేత ఊట వీరబాబు ఆధ్వర్యంలో ఆదివారం శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. తొలుత శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామకుర్తి సూర్యనారాయణ, రాయి గంగాధర్, బొల్లు విజయ్ బాబు, సిద్ధపురెడ్డి చంద్రరావు, రాయి సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



రంపయర్రంపాలెం చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం పంచాయతీ పరిధిలో పంట పొలాల మధ్య విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. పొలాలు మీదుగా 11 కేవీ విద్యుత్ తీగలు బాగా కిందకు వేళాడుతూ ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలం పనులు చేపట్టే సమయంలో వరికోత యంత్రాలకు విద్యుత్ తీగలు తగిలే ప్రమాదం ఉందని రైతులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో అధికారులు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

పరాన్న జీవులతో తస్మాత్ జాగ్రత్త

- సోకితే పశువులకు ఆరోగ్యానికి ముప్పు
- కొద్దిపాటి జాగ్రత్తలతో పశువులకు రక్షణ
- అప్రమత్తంగా లేకుంటే పశువుల ప్రాణానికే ముప్పు



పశువుకు పరాన్న జీవుల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది



బాహ్య పరాన్న జీవుల ద్వారా సోకిన వ్యాధికి చికిత్స అందిస్తున్న పశువైద్య సిబ్బంది

ప్రత్తిపాడు: ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలని అధికారులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో మురుగునీరు, వ్యర్థాలు, చెత్తాచెదారం నిల్వ ఉంటే అపరిశుభ్ర వాతావరణం నెలకొని బాహ్య పరాన్న జీవుల వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుత వాతావరణంలో పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని ధర్మవరం ప్రభుత్వ పశువైద్యశాల వైద్యాధికారి సుంకర వరలక్ష్మి సూచించారు.

రక్తాన్ని పీల్చి...

గోమార్లు, మిన్నల్లులు, పేలు, పిడుదులు, దోమలు తదితర బాహ్య పరాన్న జీవులు పశువులు, కుక్కల శరీరంపై ఆశ్రయం ఏర్పరచుకుంటాయి. ఇవి రక్తాన్ని పీల్చడంతో పశువులు బలహీనంగా మారతాయి. పశువులకు బాహ్య పరాన్నజీవులు సోకితే మేత తినకపోవడం, పాల దిగుబడి తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. బాహ్య పరాన్న జీవులు అనేక బాక్టీరియల్, ప్రోటోజోవా సంబంధిత వ్యాధులను కలుగజేస్తాయి.

బాహ్య పరాన్న జీవులు – లక్షణాలు

- **గోమార్లు**

ఇవి ఎక్కువగా పశువులు, కుక్కలను ఆశిస్తాయి. ఇవి మూడున్నర ఏళ్ల వరకూ జీవిస్తాయి. పశువుల చెవి లోపలి భాగంలో స్థావరం ఏర్పరచుకోవడం వల్ల పశువులు తలను తరచూ విదిలిస్తుంటాయి. చర్మంపై దురద, చర్మం వాపు మొదలగు లక్షణాలను గమనించాలి. గోమార్లు చర్మంపై ఉండి రక్తాన్ని పీల్చేస్తాయి. గోమార్లు శరీరంలో విషపదార్థాలు విడుదల చేయడం వల్ల ముఖ్యంగా పశువుల వెనుకకాళ్ల పక్షవాతానికి గురవుతాయి.

- **మిన్నల్లులు**

మిన్నల్లుల్లో సార్కోప్టస్, సోరాప్టస్, డిమోడెక్స్ అనే మూడు రకాలుంటాయి. సార్కోప్టస్ మిన్నల్లులు చెవి, ముఖం, భుజం, తోక భాగాలను ఆశిస్తాయి. తద్వారా దురద, వాపు, చర్మంపై పొలుసులు ఏర్పడడం, రక్తస్రావం, వెంట్రుకలు రాలిపోవడం, పశువులు నీరసపడడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సోరాప్టస్ శరీరంలోని అన్ని భాగాల్లో ఆశించడం వల్ల చర్మంపై పొలుసులు ఏర్పడతాయి. డెమోడెక్స్ మిన్నల్లుల వల్ల దురద, చీముతో కూడిన కురుపులు ఏర్పడతాయి.

- **పేలు, పిడుదులు**

పేలు, పిడుదులు శరీరంపై ఆశించడం వల్ల దురద, చర్మం వాచిపోయి ఎర్రబడడం, గాయం, రక్తహీనత సంభవిస్తాయి.

- **దోమలు**

దోమలు శరీరంపై వాలి రక్తం పీలుస్తాయి. దురదను కలిగిస్తాయి. పుండ్లలో లార్వా ఉండి, తర్వాత అవి మాగట్స్ (పురుగులు)గా వృద్ధి చెందుతాయి. పశువులు చికాకు, అలసట, నీరసానికి లోనవుతాయి. పాల దిగుబడి తగ్గుతుంది. దోమల కారణంగా పశువులకు కురంవ్యాధి, మెదడు వాపు వ్యాధి వ్యాపిస్తాయి. అలాగే జోరీగల ద్వారా పశువుల్లో సర్రా, మశూచి వంటి వ్యాధులు వ్యాపిస్తాయి.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో పశు సంపద

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు	మొత్తం
ప్రత్తిపాడు	2,935	11,372	7,244	6,064	27,615
ఏలేశ్వరం	2,440	9,302	13,307	9,396	34,445
రౌతులపూడి	2,790	11,688	5,589	10,871	30,938
శంఖవరం	3,278	8,130	7,932	8,309	27,649
మొత్తం	11,443	40,492	34,072	34,640	1,20,647

బాహ్య పరాన్న జీవుల నిర్మూలన

బాహ్య పరాన్న జీవుల నిర్మూలనకు మలాథియన్, డీడీటీ, బీహెచ్‌సీ, సుమిథియన్ తదితర మందులను తగు మోతాదులో శరీరంపై పిచికారీ చేయాలి. మిన్నల్లుల నివారణకు చర్మంపై బెంజైల్‌బెంజోవెట్, నెగువాన్ వంటి ఆయింట్‌మెంట్స్‌ను పశువుల చర్మంపై రాయాలి.

- గోమార్లు, మిన్నల్లులు, పేలు తదితర బాహ్య పరాన్న జీవుల నిర్మూలనకు మందులతో పాటు ఐవర్‌మెక్టిన్ ఇంజెక్షన్ వేయించాలి. డెమోడెక్స్ మిన్నల్లుల నిర్మూలనకు ఈ ఇంజక్షన్‌ను వారం వ్యవధిలో 4 లేదా 5 సార్లు వేయించాలి.
- దోమల వల్ల కలిగే అనర్థాలను నివారించడానికి టర్పంటైన్ ఆయిల్, యూకలిప్టస్ ఆయిల్ ఉపయోగించాలి.

> **రక్త కణాల సంఖ్య తగ్గుతుంది**
>
> 
>
> బాహ్య పరాన్న జీవులు ఆశిస్తే పశువుల్లో రక్త కణాల సంఖ్య తగ్గిపోతుంది. తద్వారా రక్తహీనత సంభవిస్తుంది. దీని చికిత్సకు ఫెరిటాస్ మాత్రలు వాడవచ్చు. బాహ్యపరాన్న జీవుల నిర్మూలనకు వాడే మందులను స్ప్రేయింగ్, డస్టింగ్, డిప్పింగ్ తదితర పద్ధతుల్లో వాడతారు. స్ప్రేయింగ్ సమయంలో మందులు కళ్లు, నోటిలో పడకుండా జాగ్రత్తలు వహించాలి. గొర్రెలు, మేకలకు డిప్పింగ్ పద్ధతి శ్రేయస్కరం. బాహ్య పరాన్న జీవులు ఎక్కువగా ఉండే శరీర భాగాల్లో డస్టింగ్ (చల్లడం) ద్వారా నిర్మూలించాలి. పశువుల పాలలు, షెడ్లలో క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాలి.
>
> – సుంకర వరలక్ష్మి, ప్రభుత్వ పశువైద్యాధికారి, ధర్మవరం, ప్రత్తిపాడు మండలం